క్లుప్తంగా

తాళ్లూరులో ఆక్రమణకు గురైన పుంత పరిశీలన



తాళ్లూరులో పుంతను పరిశీలిస్తున్న డీపీఓ రవికుమార్

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో రహదారిని ఆనుకుని ఉన్న పుంతను డీపీఓ వి.రవికుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పుంత ఆక్రమణకు గురైందని, దీనిపై సర్వే చేయాలని గ్రీవెన్స్‌కు ఇటీవల వచ్చిన ఫిర్యాదు మేరకు పుంతను పరిశీలించినట్టు తెలిపారు. తొలుత స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి షేక్ షకీలా, మాజీ సర్పంచ్ పైణ్ని వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సీహెచ్‌సీలో తనిఖీలు



ప్రత్తిపాడు సీహెచ్‌సీ సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ రమేష్

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను జిల్లా లెప్రెసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ (డీఎల్ఏటీఓ) అధికారి డాక్టర్ రమేష్ సోమవారం తనిఖీ చేశారు. సీహెచ్‌సీ ఆవరణలోని టీబీ విభాగంలో రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. లెప్రసీ, టీబీ కేసులపై ఆరా తీశారు. టీబీ కేసులను పరిశీలించారు. గత నెలలో సీహెచ్‌సీలో తొమ్మిది టీబీ కేసులు నమోదైనట్టు సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య తెలిపారు. సీహెచ్‌సీకి వచ్చే లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రమేష్ వైద్య సిబ్బందికి సూచించారు.

రైతులకు సత్కారం



రైతులను సత్కరిస్తున్న అధికారులు

తుని రూరల్: నాలుగు నెలలుగా ఖరీఫ్ పొలంబడి కార్యక్రమాలకు హాజరై అధికారుల సూచనలు సలహాలు పాటించిన రైతులను వ్యవసాయశాఖ అధికారులు ఘనంగా సత్కరించారు. తుని మండలం సుభద్రయ్యమ్మపేటలో సోమవారం ఏఓ బి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పంటకోత ప్రయోగం, మేలైన యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తొమ్మిది మంది రైతులను సత్కరించారు. ఏఈఓ పి.జగ్గ అప్పారావు, బీటీఎం బాబురావు, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న వైద్యులు

శంఖవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో 24 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 11 మందిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించారు. వారికి ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం ఎఫ్ఎన్ఓ నీలిమ ఆర్థిక సహాయంతో గర్భిణులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ-1	89856 02864
ఎంఈఓ-2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613
ఎస్సై	94409 00773
వెలుగు ఏపీఎం,	80088 04895
ఉపాధిహామీ ఏపీఓ,	70939 98217

నిర్లక్ష్యం నీడలో బాలికల హాస్టల్

- శిథిలావస్థలో వసతిగృహ భవనం
- 45 మంది విద్యార్థినులతో నిర్వహణ
- పట్టించుకోని సోషల్ వెల్ఫేర్ అధికారులు

కోటనందూరు: గ్రామాల్లోని పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు వారి భవితకు తోడ్పాటును అందించాలన్నదే వసతి గృహాల లక్ష్యం. దీనిలో భాగంగానే రాష్ట్రప్రభుత్వం విద్యార్థులకు అనువైన ప్రాంతంలో హాస్టళ్లు ఏర్పాటు చేసి లక్షల రూపాలయల ఖర్చుతో అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. అయితే కోటనందూరు మండలంలోని తిమ్మరాజుపేట బీసీ బాలికల వసతిగృహం ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా నడుస్తోంది. ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థినులకు ఈ హాస్టల్ అనువైన ప్రాంతంలో లేకపోవడంతో వారిని చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. అరకొర విద్యార్థినులతో అధికారులు సైతం ఈ హాస్టల్‌ను తూతూమంత్రంగా నడిపిస్తున్నారు. ఈ వసతిగృహం జిల్లా శివారు మారుమూల ప్రాంతంలో ఉండడంతో సోషల్ వెల్ఫేర్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం కొరవడింది. దశాబ్దాలుగా దయనీయ స్థితిలో కొనసాగుతున్న ఈ హాస్టల్‌పై సోషల్ వెల్ఫేర్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హాస్టల్ దుస్థితిపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

2004లో నిర్మాణం


మండలంలోని పాతకొట్టాం పంచాయతీ పరిధిలోని తిమ్మరాజుపేటలో 2004లో బీసీ బాలికల వసతి గృహం నిర్మించారు. ప్రస్తుతం హాస్టల్ భవనం పూర్తిగా



తిమ్మరాజుపేటలో శిథిలావస్థకు చేరిన బీసీ బాలికల వసతిగృహం



పిల్లలు లేక నిర్మానుష్యంగా ఉన్న హాస్టల్ ప్రాంగణం



శ్లాబ్ నుంచి ఊడిపడుతున్న పెచ్చులు

శిథిలమై శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. 150 మంది విద్యార్థినులకు వసతి కల్పించగల సామర్థ్యం కలిగిన ఈ హాస్టల్‌లో ప్రస్తుతం 45 మంది విద్యార్థినులు మాత్రమే ఉన్నారు. వారు కూడా స్థానిక విద్యార్థినులే కావడం విశేషం. ఈ దుస్థితికి కారణాలు పరిశీలిస్తే హాస్టల్ భవనం ఉన్న తిమ్మరాజుపేటలో కేవలం ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉండడంతో ఈ హాస్టల్‌లో విద్యార్థినులు ఉన్నత పాఠశాల కోసం ఇటు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న పాతకొట్టాం గానీ, అటు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కేఈ చిన్నయ్యపాలెం గాని వెళ్లవలసి ఉండడంతో విద్యార్థినులను చేర్పించేందుకు దూరప్రాంత తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. అలాగే హాస్టల్ నుంచి ఉన్నత పాఠశాలలకు ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం విద్యార్థినులకు ఉన్నప్పటికీ సమయానికి బస్సులు రాకపోవడం, నడిచి వెళ్లడం వల్ల ఆరోగ్య, ర్యాగింగ్ సమస్యలు తలెత్తుతున్నాయి.

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం

సోషల్ వెల్ఫేర్ అధికారులు ఈ హాస్టల్‌పై వివక్షత చూపుతున్నారు. రెండేళ్లగా ఈ హాస్టల్‌ను విద్యార్థినులకు అనువైన ప్రాంతానికి మారుస్తామని సంబంధిత జిల్లాస్థాయి అధికారులు చెబుతూ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఇక్కడ కేవలం 45 మంది విద్యార్థినులు, అదీ స్థానిక విద్యార్థులతో హాస్టల్ ఎందుకు నిర్వహిస్తున్నారో అర్థం కాని పరిస్థితి. ప్రభుత్వ నిధులు అక్కరకు వస్తున్నాయా ? అనేది ప్రశ్నార్థకమే. ఈ హాస్టల్లో ఎప్పుడు చూసినా ఉదయం, సాయంత్రం, సెలవు దినాల్లో విద్యార్థులు, సిబ్బంది లేకుండా నిర్మానుష్యంగానే ఉంటోంది.

మార్చితే మంచి ఫలితాలు



ఈ హాస్టల్ పిల్లలకు అనువుగాని ప్రాంతంలో ఉంది. దీంతో ఇక్కడ ఎవరూ చేరడానికి ఇష్టపడడం లేదు. హాస్టల్‌ను హైస్కూల్ ఉన్న గ్రామానికి తరలిస్తే ఎక్కువ మంది పిల్లలు చేరే అవకాశం ఉంది. అధికారులు ఆ దిశగా ఆలోచించి చర్యలు తీసుకోవాలి. ఈ హాస్టల్‌పై పర్యవేక్షణ కూడా కొరవడడంతో నిర్వహణతో పాటు వసతులు కూడా కొరవడ్డాయి.

– అప్పలనాయుడు, కేఈ చిన్నయ్యపాలెం

సత్యదేవుని దర్శించిన సినీ హీరో అల్లరి నరేష్



లోవ దేవస్థానంలోలో అల్లరి నరేష్, చిత్ర యూనిట్‌కు ఆశీర్వదిస్తున్న వేదపండితులు

అన్నవరం/తుని రూరల్: ప్రముఖ సినీ హీరో అల్లరి నరేష్ సోమవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అలాగే లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారిని అల్లరి నరేష్, చిత్రయూనిట్ దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

సోనియా గాంధీ బర్త్ డే వేడుకలు

ప్రత్తిపాడు: కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ప్రత్తిపాడులో ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



జగ్గంపేటలో రోడ్డు నిర్వహణ, మొబైల్ వాహన సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్



జగ్గంపేటలో హైవేపై ఏర్పాటు చేసిన జిగ్‌జాగ్‌లను పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు

జగ్గంపేట: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట పోలీస్ స్టేషన్‌లో రోడ్డు మెయింటినెన్స్, మొబైల్ వాహన సిబ్బందితో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు హైవేలో ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. యువత, ప్రజలకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై టి.రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

జగ్గంపేట: జాతీయ రహదారిపై స్థానిక జీవీఆర్ సెంటర్‌లో ప్రమాదాలు నివారించేందుకు సోమవారం పోలీసులు చర్యలు తీసుకున్నారు. టైర్లతో జిగ్‌జాగ్‌లు ఏర్పాటు చేసి ఎర్రజెండాలు, రేడియం స్టిక్కర్లు అతికించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు పర్యవేక్షణలో జగ్గంపేట ఎస్సై రఘునాథరావు ఆధ్వర్యంలో జేవీఆర్ సెంటర్‌తో పాటు, రామవరం అండర్ పాస్ బ్రిడ్జి వద్ద ప్రమాదాల నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు, పోలిసు సిబ్బంది, హైవే సిబ్బంది పాల్గొన్నారు.

గోవుల సంరక్షణకు కృషి చేయాలి



జగ్గంపేటలో ర్యాలీ చేస్తున్న ధర్మ పరిషత్ ప్రతినిధులు

జగ్గంపేట: గోవుల సంరక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలని, ప్రతి జిల్లాలో గోసంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ జగ్గంపేటలో భారతీయ ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర చేశారు. స్థానిక సోమాలమ్మ గుడి నుంచి కొంగలరావి చెట్టు వరకూ పాదయాత్ర కొనసాగింది. పాదయాత్రలో భాగంగా గోమాతను ఊరేగించారు. ఈ సందర్భంగా ధర్మ పరిషత్ జాతీయ అధ్యక్షుడు కృష్ణ చరనంద భారతీస్వామి మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణకు హిందువులు కృషి చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మ పరిషత్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు పాడుగు వెంకట ప్రసాదాచార్యులు, స్కంద దేవానందగిరి స్వాములు అభినందస్వామి, మాతవిద్య నందగిరి, జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు



లింగంపర్తిలోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలేశ్వరం: ఎరువుల దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మాధవి హెచ్చరించారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో సోమవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువగా ఎరువులు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.

17 బస్తాల విత్తనాలు సీజ్

లింగంపర్తి గ్రామంలోని కొండతిమ్మాపురం రోడ్డులో గల ఎరువుల దుకాణంపై దాడి చేసి 17 బస్తాలు(75 కేజీల) వరివిత్తనాలను అధికారులు సీజ్ చేశారు. లైసెన్సు లేకుండా వరి విత్తనాలు విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. నిందితులపై 6ఏ కేసు నమోదు చేశారు. వీటి విలువ రూ.20,400 ఉంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఓలు కరుణాకర్, బి.జ్యోతి, వీఆర్వో శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి కార్మికుల నిరసన



చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద మోకాళ్లపై నిలబడి దండాలు పెడుతున్న కార్మికులు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా సోమవారం కార్మికులు ఫ్యాక్టరీ మెయిన్ గేట్ వద్ద మోకాళ్లపై నిలబడి దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఫ్యాక్టరీ మూసివేయడంతో తామంతా ఉపాధి కోల్పోయామన్నారు. ప్రభుత్వం వెంటనే ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 14 మంది అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక పోలీస్ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 14 మందిని అరెస్టు చేసినట్టు స్థానిక సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి, వాహనాలు నడుపుతున్న 14 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి సోమవారం ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చామన్నారు. న్యాయమూర్తి కాటం భాను 12 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున రూ.1.20 లక్షలు జరిమానా, మరో ఇద్దరికి వారం రోజుల పాటు జైలుశిక్ష విధించినట్టు తెలిపారు.

రూ.70,000 జరిమానా

జగ్గంపేట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితులకు కోర్టు రూ.70,000 జరిమానా విధించినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జగ్గంపేట సర్కిల్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఏడుగురిని పట్టుకుని పెద్దాపురం కోర్టులో హాజరుపరిచామన్నారు. న్యాయమూర్తి వారిలో ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున జరిమానా విధించినట్టు తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం.సూర్యప్రభ తెలిపారు. 10న బురదకోట, 11న పాండవులపాలెం, 12న బవురువాక, 13న వెంకటనగరం, 16న చింతలూరు, ఉద్దండ జగన్నాథపురం, 17న పోతులూరు, వాకపల్లి, 18న గజ్జనపూడి, 19న శరభవరం, 20న ఉత్తరకంచి, రౌతులపాలెం, లంపకలోవ, 21న ఉలిగోగుల, మెట్టుచింత, 22న గోకవరం (ఎరకంపాలెం, గిరిజనాపురం గిరిజన గ్రామాలు), 23 వంతాడ రచ్చబండ (వంతాడ, సీముసురు గిరిజన తండాలు), 24న పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, 26న ఏలూరు, టి.రాయవరం, పి.జగన్నాథపురం, 27న ఒమ్మంగి, రాచపల్లి, 28న ధర్మవరం, 30న ప్రత్తిపాడు, 31న పెద్దిపాలెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కిర్లంపూడి మండలంలో...

కిర్లంపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జె.చిరంజీవి సోమవారం తెలిపారు. 10న తామరాడ, గోనేడ, 11న రాజుపాలెం, ముక్కొల్లు, 12న కిర్లంపూడి, జగపతినగరం, 13న చిల్లంగి, వేలంక, 17న గెద్దనాపల్లి, భూపాలపట్నం, 18న సోమవరం, క్రిష్ణవరం, 19న వీరవరం, రామకృష్ణాపురం, 20న ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం, 21న బూరుగుపూడి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని వివరించారు.

నేడు ఆనూరులో రెవెన్యూ సదస్సు

తొండంగి: మండలంలోని పైడికొండ పంచాయతీ ఆనూరులో భూసమస్యల పరిష్కారం కోసం మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ మురార్జీ సోమవారం తెలిపారు. గ్రామ సచివాలయ భవనంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. రైతులు ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



తునిలో సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

తుని: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని స్థానిక శ్రీదుర్గాభవానీ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇనుగంటి శరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏపీ ఇంజినీరింగ్ వర్కర్స్ పిలుపు మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నికల్ ఎంప్లాయీస్‌కు రూ.29,200, నాన్‌టెక్నికల్ ఉద్యోగులకు రూ.24,500 జీతం ఇవ్వాలని, 15 సంవత్సరాల సర్వీసు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, 55 ఆదివారాలు, 17 జాతీయ పండుగలను సెలవు దినాలుగా ప్రకటించాలని, విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షలు, అంగవైకల్యానికి గురైన కార్మికులకు రూ.5 లక్షలు ఇవ్వాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమకు న్యాయం చేసే వరకూ ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540

కిర్లంపూడి:

తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	- 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	- 89789 41840
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778

జగనన్న కాలనీ వాసుల ఆందోళన



ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

ఏలేశ్వరం: పట్టణంలోని జగనన్న కాలనీవాసులు సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కాలనీవాసులకు పూర్తి స్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. గత ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టగా ప్రస్తుతం నిర్మాణాలకు ఆటంకాలు కల్పిస్తున్నారని ఆరోపించారు.

వరికోతలు వాయిదా వేసుకోవాలి

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం సూచించారు. మండల పరిధిలోని గ్రామాల్లో సోమవారం పర్యటించి వరిచేలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా 10 ఎకరాలకు పైగా అంటే 60 శాతం వరికోత కోయాల్సి ఉందన్నారు. కూలీలతో సంప్రదాయ పద్ధతిలో కోత కోయించిన రైతులు త్వరగా పంటను ఒబ్బిడి చేసుకోవాలన్నారు. వర్షాల పట్ల రైతులు అప్రతమత్తంగా ఉండాలన్నారు. వారం, పదిరోజులు ఆలస్యంగా కోత కోసినా పంట రెల్లి రాల్చడం వంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.

బాధిత కుటుంబాలకు చేయూత



గజ్జనపూడిలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: తాను త్వరలో నూతనంగా ఏర్పాటు చేసే ట్రస్టు ద్వారా ఆపదలో ఉన్న ప్రతిఒక్కరినీ ఆదుకుంటానని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని గజ్జనపూడిలో బాధిత కుటుంబాలను సోమవారం ఆయన పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కొల్లు ఏసుబాబు కుమారుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన యల్లపు చంద్రమౌళి కుమారుడు చుక్కల రాజులు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొనగాల అప్పలరాజు, ఎంపీటీసీ మొల్లి వీరబాబు, మాజీ ఎంపీటీసీ అల్లి సత్తిబాబు, సాలివాహన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అనకాపల్లి నూకరాజు, చంద్రాడ రాజు, చంద్రడ అచ్చి బాబు, గోనగల శ్రీను, బోడపాటి వీరానాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.